www.kalamjyothi.com

# కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

సోమవారం

21.09.2026






# తెలంగాణకు తాగునీటి ముప్పు

## ఎల్‌నినో ప్రభావంతో అడుగంటిన జలాశయాలు

రాష్ట్రవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావం పెను దుర్భిక్ష పరిస్థితులను సృష్టిస్తోంది. రుతుపవనాలు మొహం చాటేయడంతో కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రధాన రిజర్వాయర్లలో నీటిమట్టాలు ఊహించని రీతిలో ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. దీనివల్ల తెలంగాణవ్యాప్తంగా అటు వ్యవసాయ రంగం, ఇటు తాగునీటి వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయాయి. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు ఎండిపోయి భూగర్భ జలాలు పాతాళానికి చేరడంతో పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా అన్నిచోట్లా తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకవైపు కోటిన్నరకు పైగా జనాభా కలిగిన రాజధాని హైదరాబాద్ నగర దాహార్తిని తీర్చడం పెను సవాలుగా మారుతుండగా, మరోవైపు జిల్లాల్లో సాగు, తాగునీటి వ్యవస్థలు కుదేలవుతున్నాయి. రాష్ట్ర ప్రజల గొంతు తడపడం మొదలుకొని నిండుగా పండాల్సిన పంట పొలాలు ఎడారిగా మారుతున్న తీరు, అడుగంటిన జలాశయాలు, రాబోయే రోజుల్లో తెలంగాణ సమాజానికి ముంచుకొస్తున్న ఈ విపత్కర పరిస్థితులపై సమగ్ర కథనం.

కలంజ్యోతి బ్యూరో

- భాగ్యనగర దాహార్తిపై పడనున్న తీవ్ర ప్రభావం
- డెడ్ స్టోరేజ్‌కు చేరిన సింగూరు ప్రాజెక్టు
- మంజీరా గర్భంలో తేలిన ఇసుక మేటలు
- బీడువారిన వ్యవసాయ భూములు
- కాళేశ్వరం లింక్ రిజర్వాయర్లలో పడిపోయిన నిల్వలు
- కృష్ణా, గోదావరి బేసిన్లలో తగ్గిన ప్రవాహాలు
- అత్యవసరంగా ఇంటేక్ వెల్స్‌తో నీటి తోడకం
- భగీరథ గ్రిడ్‌పై పెరుగుతున్న పెను భారం

2లో..




# మామునూరు విమానాశ్రయానికి రుద్రమదేవి పేరు

**వరంగల్ చారిత్రక వారసత్వాన్ని గౌరవిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి**

**సీఎం రేవంత్‌కు వినోద్ కుమార్ లేఖ**

చారిత్రక ఓరుగల్లు గడ్డపై కొలువుదీరుతున్న మామునూరు విమానాశ్రయానికి కాకతీయ వీరనారి రాణి రుద్రమదేవి పేరును నామకరణం చేయాలని, గత బీఆర్ఎస్ హయాంలో ఎయిర్‌పోర్టు సాధన కోసం చేసిన కృషిని విస్మరించడం తగదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వరంగల్ చారిత్రక ప్రాశస్త్యాన్ని ప్రతిబింబిస్తూ, గతంలో సాధించిన అనుమతుల వివరాలను లేఖలో ప్రస్తావించారు.

3లో..

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
సోమవారం 21.09.2026
www.kalamjyothi.com



# తెలంగాణకు తాగునీటి ముప్పు

**కలంజ్యోతి బ్యూరో (సెప్టెంబర్ 20) :** తెలంగాణవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం వల్ల విస్తారంగా వర్షాలు కురవకపోవడంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రుతుపవనాల కాలంలో కూడా ప్రధాన నదులు, ఉపనదుల్లో వరద ప్రవాహాలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఎప్పుడూ నిండుకుండల్లా కళకళలాడే భారీ ప్రాజెక్టులు, మధ్యతరహా రిజర్వాయర్లు, చెరువులు నేడు నీరు లేక వెలవెలబోతున్నాయి. భూగర్భ జలాలు ఊహించని రీతిలో పాతాళానికి పడిపోవడంతో రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తీవ్ర నీటి ఎద్దడి ప్రారంభమైంది.



**హైదరాబాద్‌కు పొంచి ఉన్న గండం..**
కోటిన్నరకు పైగా జనాభా కలిగిన రాజధాని హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సరఫరా అత్యంత సంక్లిష్టంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. నగర తాగునీటి అవసరాలను తీర్చే ప్రధాన వనరులలో ఒకటైన మంజీరా బేసిన్ ప్రాజెక్టులు పూర్తిగా ఎండిపోవడంతో గ్రేటర్ పరిధిలో తీవ్ర కొరత తప్పేలా లేదు. ఇప్పటికే శివారు ప్రాంతాలు, కాలనీల్లో తాగునీటి సరఫరా వేళల్లో తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయి. రానున్న రోజుల్లో ప్రత్యామ్నాయ వనరుల నుంచి నీటిని తరలించలేకపోతే జలమండలి వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడి పెరిగి నగరంలో నీటి యుద్ధాలు మొదలయ్యే ప్రమాదం ఉంది.

**సింగూరులో పడిపోయిన నీటి నిల్వలు..**
రాజధానితో పాటు ఉత్తర, పశ్చిమ తెలంగాణ ప్రాంతాలకు కీలకమైన సింగూరు ప్రాజెక్టులో నీటిమట్టం ప్రమాదకర స్థాయికి దిగజారింది. సాధారణంగా ఈ వర్షాకాలం సమయానికి దాదాపు 17 టీఎంసీల మేర నిల్వలు ఉండాల్సిన ఈ రిజర్వాయర్‌లో ప్రస్తుతం కేవలం 4 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఇది పూర్తిగా సాధారణ గేట్ల ద్వారా విడుదల చేయడానికి వీలు పడని డెడ్ స్టోరేజ్ పరిమితి కావడంతో అధికార యంత్రాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. ఈ నిల్వలను వినియోగించుకోలేకపోతే తాగునీటి పథకాలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం నెలకొంది.

**ఎడారిని తలపిస్తున్న మంజీరా బ్యారేజీ..**
దశాబ్దాలుగా హైదరాబాద్ నగరానికి, పరిసర ప్రాంతాలకు నిర్విరామంగా దాహార్తిని తీర్చిన చారిత్రాత్మక మంజీరా బ్యారేజీ పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. చుక్క నీరు లేక రిజర్వాయర్ గర్భం పూర్తిగా ఎండిపోయి ఎడారి మైదానాన్ని తలపిస్తోంది. నీటి ఆనవాళ్లు సైతం కనుమరుగై ప్రాజెక్టు పరిధిలో భారీగా ఇసుక మేటలు తేలడంతో పాటు పిచ్చిగడ్డి, కంపచెట్లు మొలిచాయి. ప్రాజెక్టు పరివాహక ప్రాంతమంతా తేమ లేక నెర్రెలు బారడంతో పశువులకు తాగునీరు కూడా దొరకని దౌర్భాగ్య స్థితి దాపురించింది.

**లక్షలాది ఎకరాల్లో ఆగిన సాగు..**
రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల నుంచి పంట కాలువలకు నీటి విడుదల బంద్ కావడంతో అన్నదాతలు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఆయకట్టు ఆధారిత వ్యవసాయం పూర్తిగా కుదేలైంది. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి, నల్లగొండ తదితర జిల్లాల్లో గత మూడు పంట కాలాలుగా వరుసగా సాగునీరు అందక రైతులు నాగళ్లను మూలనపెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. బోర్లలోనూ నీటి ఊటలు అడుగంటిపోవడంతో లక్షలాది ఎకరాల సారవంతమైన సాగు భూములను రైతులు బీడుగా వదిలేస్తున్నారు.

**కాళేశ్వరం ప్రాజెక్టుల్లో తగ్గిన మట్టాలు..**
తెలంగాణ సాగు, తాగునీటి రంగానికి గుండెకాయ లాంటి కాళేశ్వరం ప్రాజెక్టు అనుసంధాన రిజర్వాయర్లలో కూడా నీటి నిల్వలు అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయాయి. ఘనపురం ఆనకట్ట, హల్దీవాగుతో పాటు రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లలో నీటిమట్టాలు వేగంగా అడుగంటుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి ఆశించిన స్థాయిలో వరద రాకపోవడం, రీఛార్జ్ నిలిచిపోవడంతో ఈ భారీ రిజర్వాయర్లు లక్ష్యానికి దూరంగా మిగిలిపోయాయి. దీంతో వీటి పరిధిలోని వందలాది గ్రామాలకు సరఫరా తగ్గిపోయింది.

**నదుల్లో కనిపించని వరద ప్రవాహాలు..**
రాష్ట్రానికి జీవనాధారాలైన గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాల్లో సైతం ఈసారి సాధారణం కంటే చాలా తక్కువ ప్రవాహాలు నమోదయ్యాయి. మహారాష్ట్ర, కర్ణాటక పరిధిలోని ఎగువ ప్రాంతాల్లో వర్షాలు అంతంతమాత్రంగానే కురవడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాల, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లోకి ఆశించిన స్థాయిలో ఇన్ ఫ్లోలు రాలేదు. దీంతో హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల నుంచి నీటిని తరలించే మార్గాల్లోనూ విద్యుత్ వినియోగం, పంపింగ్ వ్యయాలు అమాంతం పెరిగిపోతున్నాయి.

**ఇంటేక్ వెల్‌స్‌తో అత్యవసర తోడకం..**
ఈ తీవ్రమైన నీటి సంక్షోభం నుంచి ప్రజలను గట్టెక్కించేందుకు ప్రభుత్వ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన అత్యవసర పనులను ప్రారంభించింది. సింగూరు ప్రాజెక్టు డెడ్ స్టోరేజ్ అడుగున ఉన్న కొద్దిపాటి జలాలను వెలికితీసేందుకు ప్రత్యేకంగా ఇంటేక్ వెల్స్ నిర్మిస్తున్నారు. భారీ సామర్థ్యం కలిగిన వ్యవసాయ, పారిశ్రామిక మోటార్లను అమర్చి భూగర్భ జలాలను, నిల్వ ఉన్న అట్టడుగు నీటిని తోడుతున్నారు. ఈ నీటిని సంప్రదాయ శుద్ధి కేంద్రాలకు తరలించి ప్రజలకు కనీస అవసరాల నిమిత్తం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**భగీరథ నెట్‌వర్క్‌పై తీవ్రమైన ఒత్తిడి..**
రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ నల్లా నీటిని అందించే మిషన్ భగీరథ పథకానికి ఇప్పుడు నీటి వనరుల కొరత పెద్ద అడ్డంకిగా మారింది. ప్రాజెక్టులలో హెడ్‌వర్క్స్ వద్ద తగినంత నీటి లభ్యత లేకపోవడంతో గ్రిడ్ వ్యవస్థ ద్వారా సరఫరా తగ్గిపోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే ఒన్‌ప్లస్ వన్ డే విధానంలో నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాబోయే కొద్ది రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసి ప్రాజెక్టుల్లోకి వరద చేరకపోతే రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయి సంక్షోభం మరింత ముదిరే ప్రమాదం ఉంది.

# రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

## సావనపెల్లి రాకేష్



**కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 20) :** మండల అభివృద్ధి విషయంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని అంబేద్కర్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు సావనపెల్లి రాకేష్ ఆరోపించారు. మండలంలోని ప్రధాన రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజల రవాణా కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు. ఇల్లంతకుంట నుంచి అనంతారం, రహీంఖాన్‌పేట, వల్లంపట్ల, ఒగులాపూర్ మీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారిందని, దీంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. రోడ్ల దుస్థితిపై అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో అనంతారం సర్పంచ్ ఒళ్ళాల రజిత-వెంకటేష్ గౌడ్, వల్లంపట్ల గ్రామ యువకులు సొంత ఖర్చులతో గుంతలను పూడ్చడం అభినందనీయమన్నారు. పొత్తూరు-గుండ్లపల్లె రోడ్డుతో పాటు మండలంలోని అన్ని రహదారులను బాగు చేయాలని కోరుతూ ఈ నెల 27న ఇల్లంతకుంట నుంచి సిరిసిల్ల వరకు పాదయాత్ర చేపట్టి, 28న కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని వెల్లడించారు.



# ఉపాధ్యాయుడు తునికి తిరుపతికి జాతీయ పురస్కారం

**సాహిత్య సేవతో పాటు సామాజిక అంశాలపై కవితాగానం చేసినందుకు అక్షర కిరీటి అవార్డు ప్రదానం**

**కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 20) :** భద్రాచలంలోని డాక్టర్ పాల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన జాతీయ ద్విశతాధిక కవి సమ్మేళనంలో స్థానిక వాణీనికేతన్ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు తునికి తిరుపతి అక్షర కిరీటి జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ముస్కాన్‌పేట గ్రామానికి చెందిన తిరుపతి ఈ సమ్మేళనంలో పాల్గొని మత్తు పదార్థాలకు బానిస కావద్దని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలనే సామాజిక అంశాలపై అద్భుతంగా కవితాగానం చేశారు. ఆయన చేస్తున్న సాహిత్య సేవలను గుర్తించి ఈ అవార్డును అందించినట్లు సంస్థ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, జాతీయ ప్రణాళిక అధ్యక్షుడు డాక్టర్ టి.పార్థసారథి, ఐటీడీఏ పీవో రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ పేదరికంలో ఉన్నప్పటికీ సాహితీ రంగాన్ని విడవకుండా నిరంతరం సేవ చేస్తానని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత తిరుపతిని పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనిధి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# భరత్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

**బీఆర్ఎస్వీ జిల్లా సమన్వయకర్త అతినారపు విష్ణు సాగర్**

**కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 20) :** శ్రీపురం సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థి కాలూరి భరత్ యాదవ్ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆయన కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా సమన్వయకర్త అతినారపు విష్ణు సాగర్ డిమాండ్ చేశారు. భరత్ మృతికి సంబంధించి అధ్యాపకుల వేధింపులపై తీవ్ర ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, వాస్తవాలు తేలేవరకు వారిని బదిలీ చేయడం కాకుండా సస్పెండ్ చేయాలని కోరారు. కేవలం బదిలీలతో సమస్యను ముగించాలనుకోవడం సరికాదని, కళాశాల పరిస్థితులపై విద్యార్థులు చేసిన ఫిర్యాదులను అధికారులు లోతుగా పరిశీలించాలని అన్నారు. నారాయణపేట ధన్వాడ మోడల్ హాస్టల్‌లో ఆహారం విషతుల్యమైతే వెంటనే వార్డెన్‌ను సస్పెండ్ చేసిన అధికారులు, భరత్ యాదవ్ మరణానికి కారణమైన వారిపై వారం గడుస్తున్నా చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే అండదండలు ఉండటం వల్లే అధికారులపై ఒత్తిడి తెచ్చి సస్పెండ్ చేయకుండా బదిలీలతో సరిపెడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పోలీసులు, ప్రిన్సిపాల్, ఆర్సీఓ శ్రీనివాస్ సమస్యలపై గళం విప్పిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పిలిపించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మాట్లాడితే టీసీలు ఇస్తామని, హాల్‌టికెట్లు ఆపుతామని, ప్రాక్టికల్స్‌లో ఫెయిల్ చేస్తామని బెదిరిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారని పేర్కొన్నారు. సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లిన తమను పోలీసులు అడ్డుకుని తెల్కపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని విష్ణు సాగర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను భయపెట్టి నిజాన్ని దాచలేరని, వారు స్వేచ్ఛగా వాంగ్మూలం ఇచ్చే వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధ్యాపకులను సస్పెండ్ చేయకపోతే రాష్ట్ర నాయకత్వంతో కలిసి రెండు మూడు రోజుల్లో గురుకులాల కార్యదర్శి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
సోమవారం 21.09.2026
www.kalamjyothi.com



# తమిళనాడులో ఎన్సీపీని బలోపేతం చేస్తాం

**యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటం సాగిస్తాం**

**ఎన్సీపీ జాతీయ నేత మద్దిశెట్టి సామేలు**



**కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం (సెప్టెంబర్ 20) :** తమిళనాడు రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది, దక్షిణాది రాష్ట్రాల్లో ఎన్సీపీ ఎన్డీఏ మహాకూటమిని బలోపేతం చేసే లక్ష్యంలో భాగంగా తమిళనాడు రాష్ట్రంలో ఎన్సీపీ పార్టీ ఎన్డీఏ మహాకూటమి ఎన్వైసీ జాతీయ నాయకులు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల ఇంచార్జ్ మద్దిశెట్టి సామేలు త్వరలో తమిళనాడు రాష్ట్రంలో పర్యటనలు చేయనున్నారు,రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ, విద్యా సమస్యలు, దక్షిణాది రాష్ట్రాల్లో ఎన్డీఏ మహాకూటమిని మరింత పటిష్టం చేయడం మరియు రానున్న రోజుల్లో తమిళనాడులో ఎన్సీపీఎన్వైసీ పార్టీని గ్రామ స్థాయి వరకు విస్తరించే విధంగా కష్టపడి పని చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు, అనంతరం మద్దిశెట్టి సామేలు మాట్లాడుతూ జాతీయ ఎన్వైసీ అధ్యక్షులు ధీరజ్ శర్మ దిశా నిర్దేశం మేరకు తమిళనాడు రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసే బాధ్యతను నేను స్వీకరించాను, అందులో భాగంగానే తమిళనాడు యువత భవిష్యత్తు కోసం అహర్నిశలు కష్టపడి పనిచేయాలని కోరుతున్నాను అని అన్నారు, త్వరలో తమిళనాడులోని అన్ని జిల్లాల్లో ఎన్వైసీ జిల్లా కమిటీలను నియమించి చెన్నైలో భారీ యువజన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.




## మామునూరు విమానాశ్రయానికి

# రుద్రమదేవి పేరు

**వరంగల్ చారిత్రక వారసత్వాన్ని గౌరవిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి**

**సీఎం రేవంత్‌కు వినోద్ కుమార్ లేఖ**

**కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 20) :** వరంగల్ జిల్లాలోని చారిత్రాత్మక మామునూరు విమానాశ్రయానికి కాకతీయ వీరనారి రాణి రుద్రమదేవి పేరు నామకరణం చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమగ్ర వివరాలతో కూడిన ఐదు పేజీల బహిరంగ లేఖ రాశారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారని, ప్రధానితో పాటు పౌర విమానయాన శాఖ మంత్రులను కలిసి సాధించిన అనుమతుల వివరాలను లేఖలో గుర్తుచేశారు. ఈ ప్రక్రియలో గత ప్రభుత్వ కృషి ఏమీ లేదనడం వాస్తవాలను దాచడమేనని అన్నారు. సీఎం హోదాలో ప్రస్తుత ప్రభుత్వ పాత్ర ఉన్నప్పటికీ, అంతా తామే చేశామనడం సమంజసం కాదన్నారు. కాకతీయ సామ్రాజ్య రాజధానిగా వెలుగొందిన వరంగల్ ప్రాశస్త్యాన్ని ప్రతిబింబించేలా విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

# గణనాథునికి అన్నదాన వితరణ

**స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసిన వనరిగారి కుటుంబ సభ్యులు**

**కలంజ్యోతి, హత్నూర (సెప్టెంబర్ 20) :** మండల పరిధిలోని సదుల నగర్ గ్రామంలో బజరంగ్ దళ్ విఘ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అభిషిత్ భార్గవ్ పటేల్ పుట్టినరోజును పురస్కరించుకుని గణనాథునికి ప్రత్యేక పూజలు, అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వనరిగారి నర్సింలు, కిష్టమ్మ, వనరిగారి భూమిక, అనిల్, అభిషిత్ భార్గవ్ పటేల్ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు జరిపించి, అనంతరం భక్తులకు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సదుల నగర్ గ్రామ పంచాయతీ మాజీ సభ్యులు వనరిగారి వీరేశం, భక్తులు వనరిగారి నర్సింలు, వనరిగారి ప్రభు, వినాయక కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
సోమవారం 21.09.2026
www.kalamjyothi.com



# రజక సంఘం మండల అధ్యక్షుడిగా రామచంద్రు

**కుల బాంధవుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటా**


**సంగెం రామచంద్రు**



**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 20) :** మండల రజక సంఘం నూతన అధ్యక్షుడిగా జల్లి గ్రామానికి చెందిన సంగెం రామచంద్రు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి నర్సంపేట నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు పొదిల రామచందర్, రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు సంగెం రమేష్ పరిశీలకులుగా హాజరై ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా ఆరెల్లి కుమారస్వామి (లింగాపురం), ప్రధాన కార్యదర్శిగా ఉప్పుల వీరస్వామి (చెన్నారావుపేట), కార్యవర్గ సభ్యులుగా నీలగిరి రవి, గుడేలి యాకయ్య, నాగెల్లి సాంబయ్య, కొత్తపల్లి ప్రభాకర్, నరసయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రామచంద్రు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, సమాజ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదిల రామచందర్, సంగెం రమేష్, వీరస్వామి, కుమారస్వామి, ఓరుగంటి అశోక్, సభ్యులు పాల్గొన్నారు.



## గణపతి మండపాల్లో ప్రత్యేక పూజలు



**కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 20) :** మండలంలోని పోత్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని గల్లీ గణేష్ మండపం, కాపువాడ గణేష్ మండపాలను సందర్శించి గణనాథుడికి పూజలు చేశారు. అనంతరం గ్రామస్థులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పట్నం అశ్విని శ్రీనివాస్, ఉప సర్పంచ్ బండారి నరేష్ గౌడ్, వార్డు సభ్యులు ఆకుల అనిల్ కుమార్, ఏనుగుల మమతా నవీన్ కుమార్, నాయకులు సిద్ధం నరసయ్య, పుట్ట కుమార్, సిద్ధం సాగర్, ఆకుల మహేందర్, సిద్ధం రవి చందర్, శ్రీనివాస్, మోహన్, నరేష్, నునగొండ బాలయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, బండారి సన్నీ, కదురు సందీప్, శనిగరపు శ్రీనివాస్, దొమ్మాటి శ్రీహరి, గాండ్ల అనిల్, బండారి సాయి కిరణ్, గుంటి రాజు, ఇరుముల్ల రాజు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇందిరమ్మ అలాట్‌మెంట్ లెటర్లు

**ఫోన్లకు వాట్సాప్, ఎస్సెమ్మెస్ రూపంలో పత్రాలు పంపుతాం**

**గృహనిర్మాణ శాఖ కమిషనర్ ప్రకటన**

**కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 20) :** ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ ప్రాజెక్టు కింద ఎంపికైన అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం సోమవారం నుంచి అలాట్‌మెంట్ లెటర్లను పంపిణీ చేయాలని నిర్ణయించింది. లబ్ధిదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు ఎస్సెమ్మెస్, వాట్సాప్ ద్వారా పత్రాలను పంపించడంతో పాటు టీజీహెచ్‌బీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా వీటిని డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించారు. అర్హులైన లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గృహనిర్మాణ శాఖ కమిషనర్ కోరారు. అలాగే శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గంలో నూతనంగా నిర్మించతలపెట్టిన 480 ఫ్లాట్ల నిర్మాణ పనులకు గృహనిర్మాణ శాఖ మంత్రి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు.

## బిక్కవాగు బ్రిడ్జి పనులు పూర్తిచేయాలి

**అక్కెం నాగరాజు**



**కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 20) :** మండలంలోని అనంతారం బిక్కవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తికాకపోవడంపై అక్కెం నాగరాజు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తీరును తీవ్రంగా ప్రశ్నించారు. గతంలో నిర్వహించిన ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే, నెల రోజుల్లో బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని, అయితే ఆ గడువు పూర్తయినా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడిగేందుకు వచ్చే ప్రజాప్రతినిధులు రోడ్లు, వంతెనల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని మండిపడ్డారు. అనంతారం-రహీంఖాన్‌పేట రహదారి అధ్వానంగా మారడంతో మోడల్ స్కూల్ విద్యార్థులు, రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జికి ఇరువైపులా గోతులు ఏర్పడి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో సెప్టెంబర్ 21 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు.




## దూడయ్య కుటుంబానికి కాంగ్రెస్ పరామర్శ

**మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన**

**మండల అధ్యక్షుడు సిద్దన రమేష్**

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 20) :** మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త సూర దూడయ్య దశదిన కర్మ కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ హాజరయ్యారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దూడయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పేట రమేష్, మాజీ సొసైటీ డైరెక్టర్ మజ్జిక రాంబాబు, ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బండి హరీష్, లింగాపురం గ్రామ శాఖ అధ్యక్షుడు మచ్చిక కుమారస్వామి, శ్రీనివాస్, సదయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో యువకుడి మృతి



**నిమజ్జన ఊరేగింపులో విద్యుత్ తీగలు తగిలి ఎంబడి శివకుమార్ అక్కడికక్కడే దుర్మరణం**

**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 20) :** వినాయక నిమజ్జన వేడుకల్లో ఆదివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పట్టణంలోని మంజులాపూర్‌లో నిర్వహించిన నిమజ్జన ఊరేగింపు సందర్భంగా విద్యుత్ షాక్ తగిలి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఊరేగింపు సాగుతున్న క్రమంలో ట్రాక్టర్‌కు అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేసేందుకు అదే గ్రామానికి చెందిన ఎంబడి శివకుమార్ (38) ట్రాక్టర్ పైకి ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో తీవ్ర విద్యుత్ ఘాతానికి గురై ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
సోమవారం 21.09.2026
www.kalamjyothi.com








శ్రీ పరివార్ సాధన సేవా సమితి

## కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా నారాయణరెడ్డి
- ఉపాధ్యక్షుడు బండి నరేష్
- ప్రధాన కార్యదర్శి అమ్మ మల్లయ్య
- కార్యదర్శి చల్ల అరుణ
- కోశాధికారి బుడుగొండ కుమారస్వామి

**కలంజ్యోతి, దుగ్గొండి (సెప్టెంబర్ 20) :** శ్రీ పరివార్ యోగ సాధన సేవా సమితి తొగర్రాయి, గిర్నిబావి గ్రామాల ఉమ్మడి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని గిర్నిబావిలో శ్రీపరివార్ సాధన సేవా సమితి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొమ్మ నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బండి నరేష్, ప్రధాన కార్యదర్శిగా అమ్మ మల్లయ్య, కార్యదర్శి చల్ల అరుణ, కోశాధికారిగా బుడుగొండ కుమారస్వామి, ప్రచార కార్యదర్శిగా మండల శంకరయ్య, అలువాల రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్య వర్గ సభ్యులుగా బండారి రవీందర్ , కలువాల సురేందర్ , బుడుగొండ అశోక్ , అలువాల కళ్యాణి, బండి అనిత, బండి నాగరాణి, కలువాల దేవేంద్ర, అమ్మ వినోద, బండారి రమాదేవి, మండల మహేందర్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బొమ్మ రమణారెడ్డి మాట్లాడుతూ.. శ్రీ పరివార్ సంస్థ ద్వారా యోగను గ్రామీణ స్థాయిలో మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుత సమజం అనేక కోణాల్లో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని, దానిని అధిగమించాలంటే కేవలం యోగ ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగను భాగం చేసుకుంటే.. ఆరోగ్యకరమైన జీవితాన్ని, ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని పొందొచ్చని వెల్లడించారు. అందరికీ ఆరోగ్యాన్ని యోగ ద్వారా అందించే లక్ష్యంతో పని చేయనున్నట్టు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి యోగాచార్యులు సదానందం గౌరోజు అధ్యక్షత వహించగా.. రాస రాజు, రాస అశోక్, పెండ్లి శ్రీను, కొక్కరగొండ అశోక్, హైమ, పెండ్లి సుజాత, బండి రాజు, యార మహేందర్, నరిగె కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



# మళ్లీ పెరిగిన చికెన్ ధరలు

**సరఫరా తగ్గడంతో కిలోపై రూ.20 నుండి రూ.30 వరకు పెంచిన వ్యాపారులు**





**కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 20) :** తెలుగు రాష్ట్రాల్లో మాంసాహార ప్రియులకు చికెన్ ధరల పెరుగుదల మరోసారి భారంగా మారింది. గతవారంతో పోలిస్తే ఈ వారం బహిరంగ మార్కెట్లో కిలో చికెన్ ధరపై దాదాపు రూ. 20 నుంచి రూ. 30 వరకు పెరిగింది. పౌల్ట్రీ ఉత్పత్తి తగ్గి సరఫరాలో ఏర్పడిన వ్యత్యాసాల వల్లే ధరలు పెంచాల్సి వస్తోందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్ నగరంలో ప్రాంతాన్ని బట్టి స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ. 250 నుంచి రూ. 265 వరకు పలుకుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రూ. 230 నుంచి రూ. 260 వరకు విక్రయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో కిలో చికెన్ ధర గరిష్టంగా రూ. 270కి చేరగా, విశాఖపట్నంలో రూ. 250, అనకాపల్లిలో రూ. 260 వరకు విక్రయాలు సాగుతున్నాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో చికెన్ ధరలు కూడా పెరగడంపై సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎంపీపీ ఓదార్పు

**ఆప్తుడిని కోల్పోవడం బాధాకరం, ఆ కుటుంబానికి తోడుగా ఉంటాం**

**మండల ఎన్నికల కన్వీనర్ జక్కా అశోక్**

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 20) :** శంకరం తండా గ్రామ పంచాయతీకి చెందిన భూక్య హనుమ తండ్రి భూక్య మంగ్య మృతి పట్ల మండల ఎన్నికల కన్వీనర్, మాజీ ఎంపీపీ జక్కా అశోక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో మృతి చెందిన మంగ్య భౌతిక కాయాన్ని ఆయన సందర్శించి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ పెద్దను కోల్పోయి కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొర్ర మోహన్, బద్రు మోహన్, ఎంపీటీసీ సాయిలు, మహేందర్ తదితరులు పాల్గొని మృతుడికి నివాళులర్పించారు.





## భూక్య మంగ్య మృతికి సంతాపం

**బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది**

**సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్**

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 20) :** శంకరం తండా గ్రామ పంచాయతీకి చెందిన భూక్య మంగ్య అకాల మృతి పట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ భూక్య గోపాల్ నాయక్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మంగ్య మృతి చెందగా, ఆదివారం ఆయన నివాసానికి చేరుకుని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. మంగ్య మృతి ఆయన కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడు గ్రామ సర్పంచ్ లావణ్యకు మామగారు కాగా, భూక్య హనుమా నాయక్‌కు తండ్రి. ఈ కార్యక్రమంలో అక్కల్‌చెడ గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్, మాజీ సర్పంచ్‌లు బద్రు నాయక్, స్వామి నాయక్, ఉప్పరపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వట్టే తిరుపతిరెడ్డి, శోభన్, సూర్య, రమేష్, రాజు, బద్రు తదితరులు పాల్గొన్నారు.




## ‘మైసా’ టీజర్‌తో అదరగొట్టిన రష్మిక

ప్రముఖ సినీ నటి రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం ‘మైసా’ టీజర్ విడుదలై విశేష ఆదరణ పొందుతోంది. ఇప్పటివరకు ఎక్కువగా గ్లామరస్ పాత్రల్లో మెప్పించిన రష్మిక, ఈ సినిమాలో సరికొత్త పవర్ ప్యాక్డ్ యాక్షన్ రోల్‌తో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. శక్తివంతమైన గోండు గిరిజన మహిళగా రక్తంతో తడిసిన ముఖం, పదునైన ఆయుధాలు ధరించి ఆమె చేసిన పోరాట దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. యుద్ధానికి ఆయుధం అంటే భయం కానీ, ఆయుధం ఏ యుద్ధానికి భయపడదనే సంభాషణ చిత్రంపై అంచనాలను పెంచింది. అడవి, గిరిజన నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాతో రవీంద్ర పుల్లే దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అన్ ఫార్ములా ఫిల్మ్స్ పతాకంపై అనిల్, అజయ్ సయ్యాపురెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంలో రాహుల్ రవీంద్రన్, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక